



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు



'పార్లమెంట్'పై ప్రధాన పార్టీల నజర్

- జిల్లాలో ఎంపీ ఎన్నికలపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ దృష్టి
- ఎన్నికల కోసం సిద్ధమవుతున్న ప్రధాన పార్టీల నేతలు
- సిట్టింగ్‌కే అవకాశం ఉండడంతో పార్లమెంట్ పరిధిలో పర్యటిస్తున్న ఎంపీ అర్వింద్
- అభ్యర్థుల ఎంపికల్లో నిమగ్నమైన కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు

నిజామాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పార్లమెంట్ స్థానంపై బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఫోకస్ పెట్టారు. వచ్చే నెలలో పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుండడంతో ముందస్తుగానే ఎన్నికల కోసం మూడు పార్టీల నేతలు సిద్ధమవుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నియోజకవర్గ స్థాయిలో సమీక్ష సమావేశాలను నిర్వహిస్తున్నారు. సమన్వయంతో ఎన్నికలను ఎదుర్కొనే విధంగా ఇప్పటినుంచే ప్రయత్నాలను చేస్తున్నారు. బీజేపీ తరఫున అభ్యర్థి పోటీ విషయంలో స్పష్టత ఉన్నా.. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ రెండు పార్టీల నేతలు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఉన్న సామాజిక వర్గాల బలాబలాలను పరిశీలిస్తూ బలమైన అభ్యర్థులను బరిలోకిదించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ రెండు పార్టీల నేతలు గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు కాకుండా ఇతర అభ్యర్థులను బరిలోకి దించితే ఏ విధమైన పరిస్థితి ఉందో సీనియర్ నేతలు ఆరా తీస్తున్నారు. తమకు సంబంధించిన సంస్థల ద్వారా సర్వేలు నిర్వహిస్తూ అభ్యర్థులను ఖరారుచేసే ప్రయత్నంలో ఉన్నారు.

త్రిముఖ పోటీకి అవకాశం

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఈ దఫా జరిగే ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొననుంది. శాసనసభ ఎన్నికల్లో మూడు పార్టీలకు మంచి ఫలితాలే వచ్చాయి. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ గెలుచుకోగా బోధన్, నిజామాబాద్ నియోజకవర్గాలను కాంగ్రెస్, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ నియోజకవర్గాలను బీజేపీ గెలుచుకుంది. ఈ దఫా శాసనసభ ఎన్నికల్లో మూడు పార్టీలకు పార్లమెంట్ పరిధిలోని ఓటర్లు పట్టం కట్టారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఏడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నా అప్పుడు బీజేపీనే ఈ సీటును కైవసం చేసుకుంది. అప్పటి సీఎం కూతురు కవితను ఓడించడంతో పాటు పట్టులేని నియోజకవర్గంలో బీజేపీ విజయం సాధించింది. ఈ దఫా ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండడం, మిగతా ఐదు నియోజకవర్గాల్లో డిపాజిట్లు సాధించడంతో పాటు పోటాపోటీగా ఓట్లు రావడం వల్ల మరో దఫా సిట్టింగ్‌ను నిలుపుకునేందుకు ఆ పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పార్లమెంట్ స్థాయిలో సమీక్ష సమావేశాలను నిర్వహించిన పార్టీ నేతలు పోటీ కోసం బూత్‌లెవల్‌పై నజర్ పెట్టారు. అన్ని బూత్‌లకు ప్రత్యేకంగా ఇన్‌చార్జిలను నియమించడంతో పాటు కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. సిట్టింగ్ ఎంపీ అర్వింద్ కూడా గడిచిన రెండు నెలలుగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. శాసనసభ ఎన్నికల్లో కోరుట్ల నుంచి పోటీచేసి ఓటమిపాలైన ఆయన ఈ దఫా పార్లమెంట్‌లో సిట్టింగ్‌ను దక్కించుకునేందుకు గట్టి ప్రయత్నాలను చేస్తున్నారు. సీనియర్ నేతలను కలుపుకుని సమన్వయంతో ముందకు పోయేందుకు సిద్ధమవుతున్నారు. సిట్టింగ్‌లకే దాదాపు టికెట్ ఖరారు కావడంతో తనకే మళ్లీసీట్ వస్తుందనే ధీమాతో ముందస్తుగా ప్రచారంలో నిమగ్నమవుతున్నారు. అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటూ క్యాడర్‌కు అందుబాటులో ఉంటున్నారు. ఈ పార్టీ నుంచి కొంతమంది సీనియర్ నేతలు పార్లమెంట్ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నా అధిష్ఠానం మాత్రం ఆయన వైపే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది.

మెజార్టీ సీట్లపై కాంగ్రెస్ యత్నం

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా కాంగ్రెస్ పార్టీ నేతలు ఈ దఫా మెజార్టీ సీట్లను రాష్ట్రంలో సాధించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. నిజామాబాద్ నుంచి కూడా బలమైన అభ్యర్థిని బరిలోకి దించేందుకు సిద్ధమవుతున్నారు. పార్లమెంట్ పరిధిలో రైతులే ఎక్కువగా ఉండడం, శాసనసభ ఎన్నికల్లో రెండు స్థానాలను గెలుచుకోవడంతో పాటు మిగతా నియోజకవర్గాల్లో రెండోస్థానంలో ఉండడం వల్ల తమకు కలిసివస్తుందని భావిస్తున్నారు. గత ఎన్నికల్లో మాజీ ఎంపీ మధుయాష్కీ పోటీ పడగా ఈ దఫా ఆయన దూరంగా ఉండడంతో ఇతర నేతలను దించేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాకు చెందిన సినీ నిర్మాత దిల్‌రాజుతో పాటు ఇతర నేతల బయోడేటాను పరిశీలిస్తున్నారు. రెండు రోజుల్లో జరిగే సమావేశంలో నిర్ణయం తీసుకుని పంపించేందుకు సిద్ధమవుతున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ నుంచి పోటీకి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మాజీ విప్ ఈరవత్రి అనిల్, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హుందాన్, మాజీ ఎమ్మెల్సీ అర్కెల నర్సరెడ్డితోపాటు బాల్కొండ నుంచి పోటీ చేసిన సునీల్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా నుంచి కూడా వీరిపేర్లను డీసీసీ సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. వీరికి కాకుండా ఇతర నేతలు కూడా సీనియర్ నేతలను కలుస్తూ అవకాశాలు ఇవ్వాలని కోరుతున్నారు. జిల్లాలో పార్టీ కోసం పదేళ్లు పనిచేసిన నేతలకు కార్పొరేషన్ పదవులను ఇస్తుండడంతో ఎంపీ కోసం బలమైన అభ్యర్థినే బరిలోకి దించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రెడ్డి సామాజిక వర్గంతో పాటు బీసీ నుంచి మున్నూరు కాపు, పద్మశాలి అభ్యర్థులను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ఎమ్మెల్సీ కవితవైపే నేతల మొగ్గు

నిజామాబాద్ పార్లమెంట్ స్థానంపై బీఆర్ఎస్ నేతలు కూడా దృష్టి పెట్టారు. గతంలో చేజార్చుకున్న సీటును ఈదఫా దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కేటీఆర్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. పార్లమెంట్ నుంచి గతంలో పోటీచేసిన ఎమ్మెల్సీ కవిత వైపే ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారు. ఆమె గతంలో తానే పోటీ చేస్తానని ప్రకటించారు. శాసనసభ ఎన్నికల సమయంలో కీలకంగా వ్యవహరించారు. గడిచిన నెల రోజులుగా ఆమె వైఖరి బయటపడకపోవడం వల్ల పోటీచేస్తుందా లేదా అని చర్చ పార్టీ నేతలతో పాటు జిల్లాలో కొనసాగుతోంది. ఆమె పోటీ చేయకుంటే జిల్లాకు చెందిన సీనియర్ నేతలు పోటీచేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ పరిధిలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండడం రెండు నియోజకవర్గాల్లో రెండో స్థానంలో అభ్యర్థులు ఉండడం వల్ల సీట్‌ను ఎలాగైనా దక్కించుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. బోధన్, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్‌లో పార్టీకి ఎమ్మెల్యే లేకపోవడం వల్ల ఎంపీని గెలిపించుకుంటే తమకు కలిసివస్తుందని భావిస్తున్నారు. అందరు కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేగా రెండు దఫాలు గెలిచి గత ఎన్నికల్లో ఓడిపోయిన బాజిరెడ్డి గోవర్ధన్‌ను బరిలోకి దించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆయనతో పాటు నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త, ఆయన సోదరుడు మహేష్ బిగాల అభ్యర్థిత్వాలను కూడా అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో బిగాల ఎంపీగా పోటీచేసినందున ఈ దఫా కూడా ఆయనకు అవకాశం ఇస్తే పోటీకి సిద్ధమవుతున్నట్లు సమాచారం. వీరితోపాటు జగిత్యాలకు చెందిన ఎమ్మెల్సీ రమణ పేరును కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

19ఏళ్ల లోపు వారికి నులిపురుగు నివారణ మాత్రలు వేయించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, జనవరి 29: ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన వారందరికి తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. ఈ మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అల్బెన్‌డజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో కరపత్రాలను, గోడప్రతులను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నులిపురుగుల వల్ల పిల్లల్లో ఎదుగుదల లోపించడం, మందబుద్ధి, రక్తహీనత, చదువు ఏకాగ్రత కోల్పోవడం వంటి రుగ్మతలకు లోనవుతారని దీనిని నివారించేందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు సార్లు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తుందన్నారు. ఫిబ్రవరి 12న జిల్లా వ్యాప్తంగా అన్ని వసతులు, విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, కిషోర బాలబాలికల సంఖ్యకు అనుగుణంగా మాత్రల పంపిణీ జరిగేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఏదైన కారణాల వల్ల మాత్రలు తీసుకోని వారికి ఫిబ్రవరి 19న అందేలా చర్యలు చేపట్టాలన్నారు. వైద్య, విద్య శాఖతో పాటు ఐసీడీఎస్, సంక్షేమ శాఖాల అధికారులు అంకిత భావంతో కార్యక్రమం విజయవంతం అయ్యేలా నూటికి నూరు శాతం అమలు అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చిత్రమిశ్రా, యాదిరెడ్డి, వైద్య ఆరోగ్యశాఖాధికారి సుదర్శనం, మకరంద్, గోవింద్, చందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నలుగురు సీఐల బదిలీలు

ఖిల్లా, జనవరి 29: నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో నలుగురు సీఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐగా పని చేస్తున్న వెంకటనారాయణను ట్రాఫిక్ విభాగానికి బదిలీ చేయగా వెయిటింగ్‌లో ఉన్న ఎస్.సురేష్‌ను సౌత్‌రూరల్ సీఐగా నియమించారు. ధర్పల్లి సీఐగా ఇటీవలే సురేందర్ నియమితులు కాగా ఆయనను తిరిగి సీసీఎస్‌కు బదిలీ చేశారు. సిద్దిపేటలో పని చేస్తున్న భిక్షపతిని ధర్పల్లి సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు

నిజామాబాద్‌అర్బన్, జనవరి 29: వచ్చేనెల 1నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఐఈవో రఘురాజ్ అన్నారు. సోమవారం ఖిల్లా ప్రభుత్వ కళాశాలలో ప్రాక్టికల్ పరీక్షలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం జనరల్ విద్యార్థులకు 55పరీక్ష కేంద్రాలు, ఒకేషనల్ విద్యార్థులకు 20పరీక్ష కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 15 ఫిబ్రవరి వరకు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు, రెండో సంవత్సరం విద్యార్థులకు వేర్వేరుగా మూడు విడతలుగా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నా రు. విద్యార్థులు హాల్‌టికెట్లను కళాశాల నుంచి లేదా ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా 17,950 జనరల్ విద్యార్థులు, ఒకేషనల్ మొదటి సంవత్సరం 2397, ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం 1991మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమీక్షలో కళాశాలల ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు పాల్గొన్నారు.

పసుపు రైతుల కోసం ప్రత్యేక నిధులు : ఎంపీ



మార్కెట్ యార్డులో పసుపును పరిశీలిస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

నిజామాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం పసుపు రైతుల కోసం ప్రత్యేక నిధులను కేటాయించిందని ప్రధాని నరేంద్ర మోదీ పసుపు బోర్డు ఏర్పాటుతో పాటు ఎగుమతుల కోసం ప్రత్యేక బృందాన్ని నియమించారని ఎంపీ అరవింద్ అన్నారు. నిజామాబాద్ మార్కెట్ యార్డులో సోమవారం పసుపు వ్యాపారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో పసుపునకు డిమాండ్ పెరిగిందన్నారు. పసుపు వ్యాపారులు జిల్లా కేంద్రంలోనే పరిశ్రమలను ఏర్పాటు చేసి ఎగుమతి చేస్తే కేంద్రం సహకరిస్తుందన్నారు. పసుపు పరిశ్రమల ఏర్పాటుకు కొత్తగా ఏర్పాటైన బోర్డు సహకరిస్తుందన్నారు. వచ్చే ఆరేళ్లలో 4వేల కోట్ల పసుపు ఎగుమతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను రూపొందించిందన్నారు. పసుపు బోర్డు ఏర్పాటుతో పాటు పసుపు పరిశోధన కేంద్రాన్ని కూడా 200కోట్లతో ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రస్తుతం పసుపునకు ధర 11వేల వరకు వస్తుందన్నారు. వ్యాపారులు రైతులకు సహకరించి ఇదే రీతిలో ధర ఉండే విధంగా చూడాలన్నారు. భవిష్యత్తులో పసుపు రైతులకు క్వింటాలుకు 20వేలు వచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని ఎంపీ అన్నారు. నిజామాబాద్ మార్కెట్‌కు జిల్లాతో పాటు జగిత్యాల, నిర్మల్ జిల్లాలతో పాటు ఇతర జిల్లాల నుంచి పసుపు వస్తుందన్నారు. పసుపు బోర్డు కోసం రైతు లు 35 ఏళ్లపాటు పోరాటాలు చేశార న్నారు. జిల్లాలోని పసుపు రైతుల ద్వారానే మార్కెట్‌కు ఆదాయం వస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. పసుపు రైతులకు ధర వచ్చే విధంగా వ్యాపారులు చూడాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తన సతీమణి పనిచేసిందని ఆ సమయంలో పసుపు రైతుల బాధలు తనకు తెలుసని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్ అన్నారు. పసుపు రైతులు కర్కుమిన్ శాతం ఎక్కువగా ఉండే రకాలను సాగు చేస్తే వారికి ఎక్కువ ధర వస్తుందన్నారు. సంప్రదాయ రకాలను సాగు చేయడం వల్ల తెగుళ్ల రావడంతో పాటు దిగుబడి తగ్గుతుందన్నారు. నిజామాబాద్ మార్కెట్‌కు సాలీన 30కోట్ల వరకు ఆదాయం వస్తుందన్నారు. ఈ ఆదాయం ఇతర మార్కెట్లకు వెళ్లకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో మార్కెట్ కార్యదర్శి వెంకటేశం మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లాభిశెట్టి శ్రీని వాస్, కమల్ కిషోర్ ఇనాని పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గిందా? వీగిందా?

- కోర్టు చుట్టూ నాయకుల ప్రదక్షిణలు
- అయోమయంలో ఆర్మూర్ మున్సిపల్ ప్రజలు

ఆర్మూర్‌టౌన్, జనవరి 29: మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస పరీక్ష నెగ్గిందా? వీగిందా? ఎటు తేల్చని అధికారులతో మున్సిపల్‌లోని ప్రజలు, నాయకులు అయోమయంలో పడ్డారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సీటు కోసం ప్రస్తుత చైర్‌పర్సన్ పండిత్ వినీత, ఆశావహులు వన్నెల్‌దేవి లావణ్య, ఖాందేశ్ సంగీతలు కోర్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అవిశ్వాస పరీక్ష ఈనెల 4న నిర్వహించడంతో ఎక్స్ అఫిషియో ఓటు వినియోగించుకోలేదనే విషయమై చైర్‌పర్సన్ పండిత్ వినీత హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు కేసును కొట్టివేసినట్లు రాజకీయ నాయకులు చర్చించుకుంటున్నారు. దీంతో అధికార పార్టీకి చెందిన జిల్లాలోని ఓ నాయకుడికి తాయిలాం అందజేసి మద్దతు తెలపాలని అవిశ్వాస పరీక్షలో ఎక్స్ అఫిషియో ఓటు వేయనందున అవిశ్వాస పరీక్ష విగినట్లు చేసి తననే కొనసాగిస్తే పెద్ద మొత్తంలో తాయిలం అందిస్తానని చెప్పడంతో సదరు నాయకుడు చెమటోర్చి కష్టపడుతు న్నాడని పలువురు చర్చించుకుంటున్నారు. జిల్లా నాయకులతో పాటు ఇన్‌చార్జి మంత్రి జూపెల్లి కృష్ణారావుని సైతం కలిసి మాట్లాడినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న ఆశావహులు అవిశ్వాసం నెగ్గిన తర్వాత అధికారులతో కలిసి తారుమారు చేసే అవకాశం ఉందని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తక్షణమే నూతన చైర్‌పర్సన్‌ను ఎన్నుకోడానికి తేదీని ఖరారు చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నట్లు తెలిసింది. మున్సిపల్ చైర్‌పర్సన్ సీటు కోసం ఇరుపక్షాలు కోర్టును ఆశ్రయించడంతో పాటు సమావేశాలు ఏర్పాటు చేసి ఓ వర్గం విగిందని మరో వర్గం నెగ్గిందని తెలపడంతో ప్రజలు అయోమయంలో పడ్డారు.

అవిశ్వాస పరీక్షలో అసలేం జరిగింది ?

ఈనెల 4న నిర్వహించిన అవిశ్వాస పరీక్షను ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ మున్సిపల్ చైరపర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాసం నెగ్గినట్లు తెలిపారు. అవిశ్వాస పరీక్ష నిర్వహించాలని నోటీసులు అందజేసినప్పుడు 36మంది కౌన్సిలర్ల పేర్లు రికార్డుల్లో ఉండగా వారికే నోటీసులు అందజేశారు. అవిశ్వాస పరీక్షకు రెండు రోజుల ముందు ఎక్స్ అఫిషియో ఓటుగా ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పేరు నమోదైంది. ఎక్స్ అఫిషియో ఓటు విషయమై ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ ఉన్నతాధికారులకు తెలిపారు. ఎక్స్ అఫిషియోకు అవిశ్వాస నోటీసు జారీ చేయనందున కౌంటింగ్‌లోకి రాదని ఉన్నతాధికారులు తెలపడంతో 36మంది కౌన్సిలర్లతో 2/3వంతు 24మంది పండిత్ వినీతకు వ్యతిరేకంగా ఓటు వేసినట్లు అవిశ్వాసం నెగ్గినట్లు తీర్మానిస్తూ ఎక్స్ అఫిషియోగా ఉన్న రాకేష్‌రెడ్డి ఓటు వినియోగించుకోలేదని తీర్మానించి ఆ కాపీని ఉన్నతాధికారులకు పంపారు.

ఎక్స్ అఫిషియో ఓటు నమోదైనట్టా.. కాదా ?

గతంలో ఆర్మూర్ ఎమ్మెల్యేగా ఉన్న జీవన్‌రెడ్డి ఎక్స్ అఫిషియో ఓటును నిజామాబాద్ కార్పొరేషన్‌లో నమోదు చేసుకొని అక్కడ వినియోగించుకున్నారు. ఒకవేళ జీవన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినట్లయితే తనఓటు కార్పొరేషన్‌లో ఉండేది. కానీ ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో పైడి రాకేష్‌రెడ్డి గెలుపొందడంతో ఆర్మూర్ మున్సిపల్‌లో నమోదు చేయించుకున్నారు. రెండు రోజుల ముందు ఎక్స్ అఫిషియో ఓటు నమోదుకావడంతో అవిశ్వాస పరీక్ష నోటీస్ రాకేష్‌రెడ్డికి ఇవ్వలేనందున అవిశ్వాస పరీక్ష తీర్మానంలో 36మంది కౌన్సిల్ సభ్యులు పేర్లను నమోదు చేసి అవిశ్వాస పరీక్షకు సమ్మతి తెలిపిన వారి సంతకాలను తీసుకున్నారు. ఎక్స్ అఫిషియో ఓటర్ తటస్థంగా ఉన్నట్లు సంతకం తీసుకోలేదు. అలాగే ఓటర్‌గా భావించి ఉంటే కౌన్సిలర్‌తో కలిసి కూర్చొనేవాడు. కానీ ఆ రోజు అతిథిగా కూర్చున్నారు. మున్సిపల్ టర్మ్ ముగియక ముందే ఆర్మూర్‌కు చెందిన శాసనసభ్యుని ఎక్స్ అఫిషియో ఓటు నిజామాబాద్ కార్పొరేషన్‌లో ఒకసారి, ప్రస్తుతం ఆర్మూర్ మున్సిపల్‌లో నమోదైంది.

ఎన్నికల హామీలను నెరవేరుస్తాం

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి


బోధన్ రూరల్, జనవరి 29: ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని, ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో మహిళలు ఎంతో సంతోషంగా ఉన్నారని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో లహరి స్లీపర్ కమ్ సీటర్ కోచ్ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బోధన్ నుంచి నిజామాబాద్ వరకు బస్సులో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి టికెట్ తీసుకుని ప్రయాణించారు. ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణంతో గమ్యస్థానాలకు చేరవచ్చన్నారు. ఆర్టీసీ ఆదాయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పాషా మొహినుద్దీన్, పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, శరత్‌రెడ్డి, కౌన్సిలర్ దాము, చిరంజీవి, తలారి నవీన్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి, డిపో మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ పరిసరాలను పరిశీలించిన ఎమ్మెల్యే

బోధన్ బస్టాండ్ పరిసరాలను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. బస్టాండ్ ప్రాంగణంలో మహిళలతో మాట్లాడారు. పలు సౌకర్యాలపై ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని భవానీపేట్ గ్రామంలో అమ్మవారి ఆలయంలో కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సంగం గ్రామ పంచాయతీ భవనంతోపాటు భండార్‌పల్లి గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం అచనపల్లిలోని గోదాముల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రైతులకు సరిపడా ఎరువులను అందిస్తామన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం 400 మంది విద్యార్థులు ఉండేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు ఆయా సజెక్టులలో వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు గుర్తించి ఉత్తీర్ణులు అయ్యేలా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, ఎంపీపీ బుద్దే సావిత్రి రాజేశ్వర్, జడ్పీటీసీ లక్ష్మి గిర్దవర్ గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, తాహెర్ బిన్ హందాన్, సర్పంచ్ అంజమ్మ గంగారెడ్డి, సొసైటీ చైర్మన్ ముత్తారెడ్డి, మండల అధ్యక్షుడు నాగే శ్వర్‌రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్, సొసైటీ చైర్మన్

సంగం గ్రామ సర్పంచ్ అంజమ్మ గంగారెడ్డిలతో పాటు సంగం సొసైటీ చైర్మన్ ముత్తారెడ్డి సోమవారం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి తామంతా స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నామని సర్పంచ్, సొసైటీ చైర్మన్ పేర్కొన్నారు.

'కాలనీ సమస్యలు పరిష్కరించాలి'

నిజామాబాద్ రూరల్, జనవరి 29: జిల్లాకేంద్రంలోని 3వ డివిజన్ పరిధిలోని గంగాస్థాన్ ఫేజ్-2 కాలనీవాసులు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని కలిశారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలసి వినతిపత్రం ఇచ్చారు. గంగాస్థాన్ ఫేజ్-2లో మురుగు కాల్వలు సరిగాలేక మురిగినీరు రోడ్డుమీదనే పారుతోందని, గంగాస్థాన్ వాసులకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరా జరగడం లేదని, కాలనీలో ఏర్పాటు చేసిన పార్కులో సరియైన వసతులు కల్పించాలని, వాకింగ్ ట్రాక్ నిర్మించాలని కోరారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల అందజేత

పెద్దబజార్, జనవరి 29: మహిళ శిశు, దివ్యాంగులు,వయోవృద్దులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత సహాయ ఉపకారణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారయణగుప్త అన్నారు. సోమవారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందచేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయని, అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సీడీపీవో సౌందర్య, బీజేపీ నాయకులున్నారు.

ఇండోర్ స్టేడియానికి రూ.50వేల విరాళం

ముప్కాల్, జనవరి 29: మండల కేంద్రంలో నిర్మితమవుతున్న ఇండోర్ స్టేడియంకు చింతకింది ఉదయ్‌కిరణ్‌రెడ్డి తనవంతుగా రూ.50వేల ఆర్థిక సహాయం చేసినట్లు పీడీ రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం ముప్కాల్ స్కూట్ క్రీడా మైదానంలో ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉదయ్‌కిరణ్‌రెడ్డిని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

మాయమాటలతో బంగారం అపహరణ

డిచ్‌పల్లి,జనవరి 29: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘన్‌పూర్ గ్రామంలో గల చైతన్యనగర్ కాలనీలో సోమవారం సాయంత్రం కాలనీకి చెందిన ఓటరుకారు చైతన్య అనే యువతికి పల్సర్ బైకుపై వచ్చిన ఓగుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌లో మీకు ఆఫర్ వచ్చిందని, ఓటీపీ చెప్పమని అడిగాడు. దీంతో యువతి తనకు ఫోన్‌లేదు అని తెలిపింది. దీంతో యువతిని మోటారు బైకుపై వెళ్దాం, ఇంట్లోని బంగారం తీసుకొని రావాలని సూచించాడు. సదరు యువతి మోసపోయి బంగారం తీసుకొని దుండగుడి బైకుపై ఘన్‌పూర్ రైల్వే గేటు పడగానే రిటర్న్ వచ్చి ఇస్లాంపూర కాలనీలో వేరే ఇంట్లోకి వెళ్లి వచ్చి ఈ ఇళ్లుమాదే అని మోసాపూరిత మాటలు చెప్పి ఆమె వద్ద ఉన్న తులంన్నర బంగారం చోరీ చేసినట్లు యువతి డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిందని ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు. అయితే, దుండగుడు బైకుపై యువతిని తీసుకెళ్తున్న వీడియో సీసీ కెమెరాలో రికార్డు కావడంతో వైరల్ అయ్యింది.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

మాక్లూర్, జనవరి 29: మండలానికి చెందిన సర్పంచ్‌తో పాటు పలువురు విండో డైరెక్టర్‌లు సోమవారం బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేశారు. మండలంలోని ఒడ్యాట్ గ్రామసర్పంచ్ సుధా రాజేశ్వర్, విండో డైరెక్టర్‌లు బురోల్ల అశోక్, శేఖర్, గంగాధర్, సోమల అశోక్, స్వర్ణ మంజులతో పాటు వార్డుమెంబర్ చింతల మోహన్, జనార్ధన్, గణపతిలు పార్టీలో చేరగా వారికి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంగాధర్‌గౌడ్, దయాకర్‌రావు, రాజేశ్వర్, లచ్చారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్‌గా కస్తూర్బా విద్యార్థులు

ముప్కాల్, జనవరి 29: జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీలో ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా ముప్కాల్ కస్తూర్బ విద్యార్థులు నిలిచారని కస్తూర్బా గాంధీ పాఠశాల స్పెషల్ వినోద తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీలో అండర్-12 కటస్‌లో విభాగంలో మహేశ్వరి, ఆర్.హర్షవర్ధిని, జి.రష్మిత, శృతకీర్తి, శాలిని గోల్డ్ మెడల్ సాధించారు. రెండవ విభాగంలో అండర్-12 ఎస్.శివనందిని, జి.అఖిల, ఎన్.దివ్యశ్రీ, సీహెచ్.అష్మిత, ఎస్.ఆరాధ్య, వనస్వీని సిల్వర్‌మెడల్ సాధించారు. సి.రష్మిత, యు.వర్ష, టి.సదిని, ఎస్.రూప, వి.శ్రీనిత్య బ్రాంచ్ మెడల్ సాధించారు. ఓవరల్ చాంపియన్‌షిప్ కప్పును ముప్కాల్ కేజీబీవీ పాఠశాలకు లభించడం పాఠశాల ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. వీరిని టస్కో ఇండియా సీస్ సత్య, శంకర్, సంతోష్, మాస్టర్ శ్రీకాంత్, టోర్నమెంట్ ఆర్గనైజేషన్ కె.రవిలు అభినందించారు.

సిద్దులగుట్ట ఆలయంలో ప్రత్యేక పూజలు

పెర్కిట్, జనవరి 29: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ పొద్దుటూరి వినయ్‌రెడ్డి సిద్దేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానంలో ఆయన పాల్గొన్నారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో పల్లకీ సేవలో భక్తులు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాల్ల సాయిరెడ్డి, శ్రవణ్‌రెడ్డి, జీవన్, ముక్కెర విజయ్, పూల నర్సయ్య, ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, గంగాకిషన్, బోండ్ల ఆనంద్, నక్కల లక్ష్మణ్, అయ్యప్ప శ్రీనివాస్, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

నిజామాబాద్ అర్బన్, జనవరి 29: ఏబీవీపీ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 19, 20వ తేదీల్లో నిర్వహించిన యువజన వారోత్సవాల క్రీడపోటీల విజేతలకు సోమవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారయణగుప్త బహూమతులు అందజేశారు. నగరంలోని న్యూఅంబేడ్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ పోటీలల్లో గెలుపొందిన విద్యార్థులకు బహూమతులు అందజేశారు. విద్యార్థి దశ నుంచే గెలుపోటములు అలవాటు చేస్తూ గెలిచిన వారు మరింత ముందుకు వెళ్తూ ఓడిన వారు గెలువడానికి ప్రయత్నం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు రెంజర్ల నరేష్, విభాగ్ సంఘటన కార్యదర్శి రాజుసాగర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోజ్, జిల్లా కన్వీనర్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష ఫీజు గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్, జనవరి 29: వచ్చే మార్చి 2024లో జరిగే పదవ తరగతి వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులకు తత్కాల్‌స్కీమ్ ఫీజు గడువును ఫిబ్రవరి 6వ తేది వరకు పొడగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వి.దుర్గాప్రసాద్ తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు నమోదు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే మార్చిలో జరిగే వార్షిక పరీక్షకు, ఆ తర్వాత జరిగే సప్లమెంటరీ పరీక్షలకు అర్హులకు కావున పదవతరగతి వార్షిక పరీక్షలు రాసే రెగ్యులర్, ఒకసారి ఫేల్ అయిన వారికి పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఇదే చివరి అవకాశమని ఆయన తెలిపారు.

జక్రాన్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం వాయిదా

జక్రాన్‌పల్లి, జనవరి29:మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ కుంచాల విమల అధ్యక్షతన జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్టు ఎంపీడీవో బ్రహ్మానందం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మండల సర్వసభ్య సమావేశాన్ని ఫిబ్రవరి 6వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

టీయూ ఇన్‌చార్జ్ వీసీని కలిసిన అసిస్టెంట్ రిజిస్ట్రార్

డిచ్‌పల్లి,జనవరి29: తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ బుర్ర వెంకటేశం (ఐఏఎస్)ను సోమవారం వర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్, సాయాగౌడ్ హైదరాబాద్ కలిశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ పలు విభాగాల్లో వివరాలను ఇన్‌చార్జి వీసీ అడిగి తెలుసుకున్నారని సాయాగౌడ్ తెలిపారు.

టీయూలో బాలికల హాస్టల్ నిర్మాణం ఎప్పుడు!?

● టీయూలో బాలికలకు వసతి కరువు ● ఇరుకుగా మారిన హాస్టల్ వసతి 300మందికి సరేపోయే భవనంలో 500మంది విద్యార్థులు ● ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు


టీయూ బాలికల హాస్టల్ ఇదే ..

డిచ్‌పల్లి, జనవరి 29: రాష్ట్ర అవతరణకు ముందే ప్రత్యేక తెలంగాణరాష్ట్రం పేరుతో ఉన్న ఏకైక యూనివర్సిటీ ఈ డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీ. ఇంత ఘనమైన పేరున్న ఈ విశ్వవిద్యాలయంలో బాలికలకు తీవ్రమైన వసతి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రం అవతరించి 10ఏళ్లు గడిచిన వర్సిటీలో బాలిక వసతి సమస్య నేటికి తీరడం లేదు ఎన్నో సార్లు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు,రాష్ట్ర గవర్నర్‌కు వినతి పత్రాలు విద్యార్థులు అందించిన సమస్య పరిష్కారం కావడం లేదు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విద్యార్థినులు ఇక్కడికి పీజీ, ఉన్నత చదువుల కోసం వస్తుంటారు. గత 5సంవత్సరాల కాలంగా ఈ హాస్టల్ సమస్య తీవ్రంగా వేధిస్తున్న ప్రభుత్వ, పెద్దలు, ఉన్నత విద్యామండలి స్పందించకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పీజీ కోర్సుల్లో అన్ని విభాగాల్లో విద్యార్థినులే అధిక శాతం సీట్లు 100శాతం సీట్లలో 72మంది విద్యార్థినులే సీట్లు సాధిస్తున్నారు. దీంతో వర్సిటీలోని బాలికల హాస్టల్‌లోని ఒక్కో గదిలో 5నుంచి 6గురు ఉండాల్సి ఉండగా 10 నుంచి 15 మంది సర్దుబాటు చేసుకుంటున్నారు.తెలంగాణ యూనివర్సిటీలో 1851మంది విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరగా 1226మంది బాలకలు పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందారు.గతంలో ఏన్నడు లేని విధంగా పీజీ కోర్సుల్లో బాలికలు ఎక్కువగా చేరుతుండటంతో హాస్టల్ అకామిడేషన్ ఇబ్బందిగా మారుతోంది. దీంతో యూనివర్సిటీ అధికారులు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించకుండా ఒత్తిడిని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. గత పదేళ్ల క్రితం 300 మంది కోసం కట్టిన బాలికల హాస్టల్‌లో ప్రస్తుతం 500మంది ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కెమిస్ట్రీ, తెలుగు, ఇతర డిపార్టుమెంట్‌లలో 30 నుంచి 60 సీట్లకు పెంచిన హాస్టల్ వసతి మాత్రం పెంచడం లేదని దీంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని విద్యార్థినులు వాపోతున్నారు. ఇటీవల విశ్వవిద్యాలయానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సందర్శించి సమయంలో విద్యార్థులు బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని ఆమెకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే సమస్య పరిష్కరించేందుకు స్వయంగా హాస్టల్ సందర్శించిన గవర్నర్ హామీ ఇచ్చి 6నెలలు గడిచిన ఇంత వరకు హాస్టల్ వసతి నిర్మాణానికి చిలిగవ్వ కూడా మంజూరు కాకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. జిల్లా శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు వసతి గృహం ఏర్పాటు పట్ల ప్రత్యేక చొరవ చూపాలని విద్యార్థినులు కోరుతున్నారు.


టీయూ స్వాగత తోరణం


టీయూ కళాశాల భవనం

కల్యాణలక్ష్మి ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా చూడాలి

● పెండింగ్ పనులు, పథకాలపై ఆరా ● ప్రజాప్రతినిధులకు సూచించిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, జనవరి29: కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా చూడాలని ఎప్పటి క్లీయర్ చేయాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సూచించారు. సోమవారం బాల్కొండ ఎమ్మెల్యే నియోజకవర్గ పథకాల తీరుపై నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, అధికారులతో తన క్యాంప్ కార్యాలయంలో ఆయన నియోజకవర్గ అధికారులు ఆర్డీవో, డీఎల్‌పీవో, తహసీల్దార్, ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు,ఎంపీపీ, జడ్పీటీసీలతో సమీక్ష సమావేశం నిర్వ హిం చారు. ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులపై, పెండింగ్ పనులపై నియో జకవర్గ సమస్యల పరిష్కారానికి బాధ్యత తీసుకొని కృషి చేయాలని సూచించారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులపై ఆరా తీశారు. నియో జకవర్గంలో సుమారు 9500దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలి పారు. ఇందులో కొత్త రేషన్‌కార్డుల కోసం 20వేల మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. పాత కార్డులలో పేర్ల మార్పు కోసం మరో నాలుగు వేల మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. ఈ దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ఎంత వరకు వచ్చిందని అధికారులను అడిగితెలుసు కున్నారు. ధరణి అమలు తీరుపై చర్చించారు. క్లీయర్‌గా ఉన్న టైటిల్‌ను వెంటనే పరిష్కరించాలని, కలెక్టర్ వద్ద గాని సీసీఎల్‌ఏలో పెండింగ్‌లో ఉన్న క్లీయర్ కానీ ఫైళ్లు తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కా రానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. మండలాల వారీగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా కొనసాగుతున్న ఉపాధి హామీ పురోగతిపై అధికా రులను ఆయన అడిగితెలుసుకున్నారు. పనులు లక్ష్యాన్ని చేరుకుం టు న్నామా? లేదా అని అధికారులను అడిగితెలుసుకుంటున్నారు. వెంటనే ఉపాధి హామీ పనులు వేగవంతంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వినోద్‌కుమార్, ఆయా మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

రూరల్ క్వారీల్లో తనిఖీలు

● గుండారం క్వారీలో మైనింగ్ అధికారుల తనిఖీ
● కంకర నిల్వలు పరిశీలన
● రాత్రివేళల్లో బ్లాస్టింగ్‌లపై ఆరా

నిజామాబాద్ రూరల్, జనవరి 29: రూరల్ మండల పరిధిలోని క్వారీలపై మైనింగ్ అధికారులు దృష్టి సారించారు. రూరల్ మండల పరిధిలో నాలుగు కంకర క్వారీలున్నాయి. గుండారం గుట్టను ఆనుకుని ఈ క్వారీలను నిర్వహిస్తున్నారు. క్వారీల్లో బ్లాస్టింగ్‌కు అనుమతి లేకన్నా రాత్రి సమయంలో క్వారీ నిర్వాహకులు బ్లాస్టింగ్‌లు జరుపుతున్నారు. స్థానికులు ఎన్నిసార్లు పోలీసులకు, మైనింగ్ అధికారులకు ఫిర్యాదుచేసినా పెద్దగా స్పందించలేదు. తాజాగా మైనింగ్ అధికారులు కంకర క్వారీలను తనిఖీ చేశారు. సోమవారం మండల పరిధిలోని పలు క్వారీలను పరిశీలించారు. గుండారం గ్రామ సర్వేనెంబర్ 984లోని కంకర క్వారీని గనులు భూగర్భ శాఖ అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. క్వారీకి కేటాయించిన హెక్టార్ భూమిలో జరుపుతున్న తవ్వకాలను పరిశీలించారు. క్వారీలో ఉన్న కంకర నిల్వలను రికార్డులను పరిశీలించారు. పరిధికి మించి బ్లాస్టింగ్ చేసి కంకరను సరఫరా చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు అధికారులు తెలిపారు. క్వారీ తనిఖీ వివరాలను జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదించనున్నట్లు గనులు, భూగర్భ శాఖ ఏడీ సత్యనారాయణ తెలిపారు.


క్వారీలో నిల్వచేసిన కంకర

కంకర లారీ బోల్తా..

బోధన్‌రూరల్, జనవరి 29 : బోధన్ పట్టణ శివారులోని పెగడాపల్లి రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి కంకరతో వెళుతున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాల య్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కంకరతో వెళుతున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడటంతో జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది.

ఏర్గట్ల కేజీబీవీలో విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు


కేజీబీవీలో విద్యార్థులకు రక్తహీనతపై వివరిస్తున్న వైద్య సిబ్బంది

ఏర్గట్ల, జనవరి 29: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం అనిమియా ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి ఐరన్ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ ప్రసన్న ప్రియ విద్యార్థుతో మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రాజేశ్వర్, పర్యవేక్షకుడు ఆకుల మారుతి, కేజీబీవీ ఎస్‌వో సంధ్య పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనేమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రక్త హీనత, హెమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. కోటగిరి మైనారిటీ జూనియర్ కళాశాలలో 83మంది విద్యార్థులకు రక్తహీనత, హెమోగ్లోబిన్ పరీక్షలు చేయగా ఒకరికి మాత్రమే హెమోగ్లోబిన్ తక్కువ స్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. నాలుగు రోజుల క్రితం పొతంగల్, కోటగిరి ఉర్దూ మీడియం పాఠశాలలో పరీక్షలు నిర్వహించగా 9మంది విద్యార్థులకు రక్త హీనత ఉన్నట్లు గుర్తించి వారిని ఆయా ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ జయప్రకాష్, ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, సూపర్‌వైజర్ జ్యోతి, ఆరోగ్య సిబ్బంది సావిత్రి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ

రెంజల్,జనవరి29: ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కాలమానిని రెంజల్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సోమవారం మండల అధ్యక్షురాలు సుజాత ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజీబీవీలో పని చేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్‌కు కనీస వేతనాలు అమలు రావడం లేదని, వీరికి పీఎఫ్, ఈఎస్ఐ, ఆరోగ్య, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని వారన్నారు. జీవో నెంబర్ 60ని అమలు చేయాలని, పని భారం పెరిగిన ఖాళీలు భర్తీ చేయడం లేదని కనీస వేతన అమలు చట్టాన్ని అమలు చేసి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి భారతి, సహాయ కార్యదర్శి, కోశాధికారితదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పీఆర్ భవన్‌లో సోమవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి 327విద్యుత్ యూనియన్, పీఆర్‌టీయూ క్యాలెండర్‌లు, డైరీలను ఆవిష్కరించారు.

నేడు ఆర్మూర్ మండల సర్వసభ్య సమావేశం

ఆర్మూర్‌రూరల్, జనవరి29: ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఎంపీపీ పస్కనర్సయ్య అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి సకాలంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు కావాలని ఆయన తెలిపారు.

విద్యుత్ అధికారిని దుర్భాషలాడిన వ్యక్తిపై ఫిర్యాదు

నవీపేట,జనవరి29: మండల కేంద్రంలోని బావర్చి హోటల్ నిర్వాహకుడు ఇంద్రకరణ్‌పై నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని ట్రాన్స్‌కో ఏఏఈ ప్రవీణ్ కుమార్ తెలిపారు. హోటల్‌తో పాటు తన ఇంటికి సంబంధించిన విద్యుత్ బకాయిలు పేరుకుపోవడంతో సోమవారం లైన్‌మేన్ కృష్ణ విద్యుత్ సరఫరాను నిలిపివేయగా ఫోన్‌లో ఇంద్రకరణ్ లైన్‌మెన్‌ను దుర్భాషలాడుతూ దూషించాడని అన్నారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏడీఏ సుహాసినితో పాటు ట్రాన్స్‌కో సిబ్బంది కలిసి నవీపేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈవిషయంపై ఇంద్రకరణ్‌పై లైన్‌మెన్ కృష్ణ ఫిర్యాదు చేసినట్లు ఏఏఈ పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్ఐ యాదగిరి గౌడ్‌ను వివరణ కోరగా ట్రాన్స్‌కో లైన్‌మేన్ ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నామని అన్నారు

కాంగ్రెస్‌లో చేరిన డిచ్‌పల్లి సొసైటీ డైరెక్టర్‌లు

డిచ్‌పల్లి,జనవరి 29:డిచ్‌పల్లి సహకార సంఘం డైరెక్టర్‌లు సతీష్‌రెడ్డి (ఘన్‌పూర్),గంగారెడ్డి(దూస్‌గాం)లు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేశ్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే నెల 7న డిచ్‌పల్లి సొసైటీ అధ్యక్షుడిపై అవిశ్వాస తీర్మానం ఉన్న నేపథ్యంలో డైరెక్టర్‌లు కాంగ్రెస్‌లో చేరడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కంచెట్టి గంగా ధర్, పొలసాని శ్రీనివాస్,రాంచందర్‌గౌడ్,మధుసుదన్, గంగారెడ్డి, పాల్గొన్నారు.

అరుదైన ఆపరేషన్ చేసిన వైద్యులకు సన్మానం


వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

పెద్దబజార్, జనవరి 29 :జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్ చేసిన వైద్యులను మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన ఇర్ఫాన బేగం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్, గైనాకలిస్టు డాక్టర్ అపర్ణలను ఘనంగా సన్మానించారు.సోమవారం ఆమెకు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు యోజినాల్ ఇస్ట్రెక్టమి అనే క్లిష్టమైన గర్భాశయ సంబంధిత శస్త్ర చికిత్సను కడుపుపై ఎటువంటి కోతలేకుండా విజయవంతంగా ఆపరేషన్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెరుగుతోందని ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తూ ఉంటే మరింత ప్రజలకు మంచి చేసే అవకాశం ఉంటుందన్నారు. వైద్య బృందానికి డాక్టర్ ప్రతిమరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

నందిపేటలో మల్లెపూల నరేందర్ వర్ధంతి

నందిపేట, జనవరి29: నందిపేట మండల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మల్లెపూల నరేంధర్ 33వ వర్ధంతిని నిర్వహించారు. 33ఏళ్ళ క్రితం పోలీసులు, నక్సల్స్ మధ్య జరిగిన కాల్పుల్లో నరేంధర్ మృతి చెందారు. ఈ సందర్భంగా ఏఐటీకెఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ జర్నలిస్టుగా పని చేస్తూ ప్రజల కోసం, ప్రజా సంక్షేమం కోసం నరేంధర్ వార్తలు సేకరించి వారికి న్యాయం జరిగేలా చూసేవాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాజలింగం, అనంత్ రావు, దేవన్న, వంజరి గంగాధర్, స్వప్న, లత, తదితరులు పాల్గొన్నారు.

వైస్‌చైర్మన్‌ను ఇన్‌చార్జీ చైర్‌పర్సన్‌గా ప్రకటించాలి


ఆర్మూర్ అంబేద్కర్‌చౌరస్తా వద్ద దీక్ష చేస్తున్న ముస్లీం మైనారిటీ నాయకులు

పెర్కిట్, జనవరి29: ఆర్మూర్ మున్సిపల్ ఇన్‌చార్జీ చైర్‌పర్సన్‌గా వైస్ చైర్మన్ షేక్ మున్నను ప్రకటించాలని సోమవారం పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద మైనారిటీ నాయకులు దీక్ష చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లీం మైనారిటీలను వ్యతిరేకిస్తూ మైనారిటీలు వైస్‌చైర్మన్ షేక్ మున్నను ఇన్‌చార్జీ చైర్‌పర్సన్‌గా ప్రకటించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు ఇంతియాజ్, నాయకులు ముస్లీం మైనారిటీ నాయ కులు పాల్గొన్నారు.

దోంచందలో విద్యుదాఘాతంతో గేదెల మృతి

ఏర్గట్ల, జనవరి 29: మండలంలోని దోంచంద గ్రామంలో సోమవారం విద్యుత్ షాక్ తగిలి రెండు గేదెలు మృతి చెందాయి. గోదావరి తీరం వద్ద మేతకు వెళ్ళిన గేదెలు అక్కడ ఏర్పాటు చేసుకున్న మోటార్‌లకు తగలడంతో విద్యుదాఘాతంతో నీట మునిగి మృతి చెందినట్లు బాధితులు రవిరేకుల శ్రీనివాస్, మేకల శరీన్‌లు తెలి పారు. ఒక్కో గేదె 50 వేలు ఉంటుందని. రెండు గేదెల విలువ సుమారు రూ. లక్షల ఉంటుందని ప్రభుత్వపరంగా నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.


దోంచందలో మృతి చెందిన గేదెలు

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూరు, జనవరి 29 : రుద్రూరు మండలంలోని అంబంలోని ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో 2024-25 విద్యా సంవత్సరంలో 6 నుంచి 10వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అలూర్ నరేందర్ తెలిపారు. ఫిబ్రవరి 22లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఓమయ్య

పెద్దబజార్, జనవరి 29: కేంద్ర ప్రభుత్వం మోటర్‌వెహికల్ యాక్ట్‌లో తీసుకొస్తున్న సవరణలో భాగంగా హిట్‌అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఓమయ్య డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ఓల్డ్‌బస్‌స్టాండ్ ఎదుట ఆటో, జీపు డ్రైవర్ల అడ్డలో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా రంగంలో పని చేస్తున్న డ్రైవర్లకు, ఓనర్లకు బిగించే చట్టం అన్నారు. కార్మికులు కావాలని యాక్సిడెంట్ చేయరని పొరపాటున ఎవరి వల్ల తప్పు జరిగిన వాహన డ్రైవర్‌ను బాధ్యున్ని చేస్తూ 7ఏళ్ల జైలు, పది లక్షల జరిమాన విధించడం సరికాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి రోజు వాహనాల ద్వారా పెట్రోలు, డీజిల్, వివిధ రకాల అన్ని ముడిసరుకులును రవాణ చేస్తూ కోట్ల రూపాయలను వసూలు చేస్తూ వాహన డ్రైవర్లకు క్షేమం కోసం నయాపైసా ఖర్చు చేయడం లేదన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హన్మాండ్లు, చక్రపాణి,మహ్మద్ అలీ, అజీజ్, మోయిన్‌పాషా, ఎండి.గౌస్, ప్రవీణ్, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలి

- డిచ్‌పల్లిలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

డిచ్‌పల్లి, జనవరి 29: కొత్త విద్యావిధానాల పేరుతో పాత సంస్కృతికి స్వస్తి పలుకుతున్న కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం డిచ్‌పల్లిలోని ఎస్‌పీఆర్ కళాశాల వద్ద సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి దినేశ్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు రఘురామ్ పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తు నిర్దేంచే విధంగా విద్యావిధానం ఉండాలని విద్యార్థుల కాళ్లకు సంకేళ్లు పడేలా విద్యావిధానం ఉండరాదన్నారు. నూతన విద్యావిధానం లోపాయిష్టంగా ఉందని ఆయన విమర్శించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలిగా అంజలి మాట్లాడుతూ.. బీజేపీ కుట్ర పూరితంగా నూతన విద్యావిధానం తీసుకొచ్చిందని దీని ద్వార విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నర్థంగా మారే ఆవకాశం ఉందని విమర్శించారు. నూతన విద్యా వ్యతిరేకంగా నిర్వహించిన సంతకాల సేకరణకు ఆమె హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు దినేశ్ , రాహుల్, సందీప్, సాయిరాజు, క్రాంతి, పాల్గొన్నారు

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

నవీపేట,జనవరి29: మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పర్యటించనున్నారని మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మండలంలోని అభంగపట్నం, మట్టయ్య ఫారం, అబ్బాపూర్(బి), మద్దెపల్లి, యంచ, నందిగాం గ్రామాలలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొననున్నారని ఆయన పేర్కొన్నారు.

ముబారక్‌నగర్‌లో వరుస చోరీలు

నిజామాబాద్ రూరల్, జనవరి 29: రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ముబారక్‌నగర్‌లో వరుస చోరీలు జరిగినట్లు తెలిసింది. రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. 18వ డివిజన్ పరిధిలోని ముబారక్ నగర్ పరిధిలో కస్తూరీ గార్డెన్ కాలనీలో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో ఆదివారం రాత్రి దొంగలు చోరీలకు పాల్పడ్డారు. ధనలక్ష్మి అనే మహిళ ఇంట్లో చొరబడి 5 తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. అదే కాలనీలో నివాసముండే రాజగంగు అనే మహిళ ఇంట్లో చొరబడి బీరువాలో దాచి ఉంచిన 5 తులాల బంగారు ఆభరణాలు, రూ. 1.20 లక్షల నగదు అపహరించారు. బాధితుల ఫిర్యాదుమేరకు క్లూస్ టీం సిబ్బంది ఘటనాస్థలిక వెళ్లి పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నగరంలో గుర్తు తెలియని వ్యక్తి హత్య

- వివరాలను పరిశీలిస్తున్న నగర ఇన్‌స్పెక్టర్

ఖిల్లా, జనవరి 29 :నగరంలోని రెండవ పోలీసు స్టేషన్ పరిధిలోని ఖిల్లా ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న ఇంటి ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్నిసోమవారం పోలీసులు గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు నగర ఇన్‌స్పెక్టర్ నరహరి, రెండో టౌన్ ఇన్‌చార్జీ ఎస్ఐ మనోజ్‌లు ఘటన స్థలానికి చేరుకుని వివరాలను పరిశీలించారు. మృతుడి ఆనవాళ్ల గుర్తించే పనిలో పోలీసులు పడ్డారు. ఖిల్లా రోడ్డులో గల పెట్రోల్ బంక్ సమీపంలోని పాఠశాల ప్రాంతంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వ్యక్తిని దారుణంగా హత్య చేసి తగులబెట్టి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడి ఎక్కడి వాడు, ఇక్కడ ఎందుకు వచ్చాడు ఎందుకు హతమార్చి తగులబెట్టారు అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మనోజ్ తెలిపారు.



హత్య జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, జనవరి29: అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యామని నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కలిగోట్ గ్రామంలో గల పుట్ట శివాలయంలో ఆయన పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 52రోజుల్లోనే రూ.10కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సులో ఉచిత బస్ సౌకర్యాన్ని మహిళలు సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఆరోగ్యశ్రీలో రూ.10లక్షల ఇచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పథకాన్ని ప్రారంభించారన్నారు. వచ్చే నెలలో ఫిబ్రవరి మొదటి వారంలో మరో రెండు పథకాలు రూ.500కే గ్యాస్ సిలిండర్, మహాలక్ష్మీ పథకంను సీఎం అమలు చేస్తారన్నారు. ఇందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి చూపిస్తుందన్నారు. ప్రజాపాలనలో ఆరు గ్యారంటి పథకాలను పొందేందుకు ప్రజలు దరఖాస్తు చేసుకున్నారని, ఈ పథకాల అమలు కోసం అధికారులు ఇంటింటికి వచ్చి సర్వే చేస్తారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారికి రేషన్‌కార్డులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. రాబోయే రోజుల్లో రూ.12 వేల కోట్లతో మెగా డీఎస్సీని కాంగ్రెస్ ప్రభుత్వం వేస్తుందని, పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తుంద న్నారు. రాష్ట్ర ప్రజల అండదండలతో మరో 15ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల పార్టీ అని ప్రజల పక్షాన ఉంటుందన్నారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం జవాబుదారిగా ఉంటుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను ప్రజల నమ్మకం పోయిందన్నారు. గడిచిన బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. ఆచరణలో అమలు కానీ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పేదప్రజలకు రేషన్‌కార్డులు ఇవ్వలేదన్నారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలు జరిగాయని అన్నారు. కాళేశ్వర్ ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోవడమేనన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు ఓడించారన్నారు. కలిగోట్ గ్రామంలో ప్రధానమైన డ్రైనేజీ సమసయ తీరుస్తానన్నారు.సీసీరోడ్లకు రూ.15 లక్షలు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. జక్రాన్‌పల్లిలో 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయిస్తానన్నారు. రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయిస్తామన్నారు.ఈకార్యక్రమంలో సర్పంచ్‌చేతనరెడ్డి, ఉప సర్పంచ్ రాజు, అర్గుల్ ఎంపీటీసీ అనిత, మండల కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు చిన్నారెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు వినోద్, గ్రామ కాంగ్రెస్‌అధ్యక్షుడు దేవరాజుల గంగాధర్, మాజీఎంపీపీలు కె.అనంత్ రెడ్డి, అప్పాల పెద్ద రాజన్న, మాజీసర్పంచ్ గంగాధర్, వీడీసీసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షలకు 94మంది విద్యార్థుల గైర్హాజరు

డిచ్‌పల్లి, జనవరి 29: తెలంగాణ యూనివర్సిటీపరిధిలో పీజీ 3, 5,7,9వ సెమిస్టర్ రెగ్యులర్, నాలుగవ రోజు పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగా యి. వర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, లా కళాశాల, సౌత్ క్యాంపస్, ఆర్మూర్ డిగ్రీ కళాశాల, కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బా న్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో పరీక్షలు జరు గుతున్నాయని ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం జరిగిన పరీక్షకు 1699 అభ్యర్థులకు గాను 1605 విద్యార్థులు హాజరయ్యారని, 94మంది గైర్హాజ రయ్యారని ఆడిట్‌సెల్ డైరెక్టర్ తెలిపారు. మధ్యాహ్నంజరిగిన పరీక్షలకు181 మంది విద్యార్థులకుగాను180 మంది విద్యార్థులు హాజరయ్యారని ఒకరు మాత్రం పరీక్షకు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

ప్రజావాణికి 61ఫిర్యాదులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్,ఇతర అధికారులు

నిజామాబాద్‌అర్బన్,జనవరి 29:ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఈ వారం 61ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు చిత్రమిశ్రా,యాదిరెడ్డి,నగరపాలక సంస్థ కమీషనర్ మకరంద్, జడ్పీ సీఈవో గోవింద్ తదితరులకు ఫిర్యాదులను సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

- ఇండ్ల స్థలాల కోసం కలెక్టర్ వద్ద ఆందోళన

నిజామాబాద్‌అర్బన్: భీంగల్ మండలం బెజ్జోర గ్రామానికి చెందిన పేద ప్రజలకు ఇచ్చిన స్థలం అన్యక్రాంతమవుతుందని ఆస్థలాన్ని తమ కు ఇచ్చి న్యాయం చేయాలని గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామంలోని సర్వే నంబర్.73,74లో 15ఎకరాల స్థలాన్ని పేదలకు ఇండ్లు క ట్టుకునేందుకు గ్రామానికి చెందిన కర్నాలు విరాళంగా ఇచ్చారని 2002లో అప్పటి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి 365ఇండ్ల పట్టాలను ఆస్థలంలో ఇచ్చారని చాల మంది ఆర్థిక పరిస్తితులు బాగ లేక ఇండ్లు కట్టుకోలేదని ఆస్థలాన్ని కొంత మంది ఆక్రమించుకునేందకు ప్రయత్నాలు చేస్తున్నారని కావున ఆ భూమిని పేదలకు చెందేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

రేపు ఎమ్మెల్సీగా మహేష్‌కుమార్‌గౌడ్ ప్రమాణశ్రీకారం

నిజామాబాద్‌అర్బన్, జనవరి 29:ఈనెల 31న టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ ఎమ్మెల్సీగా ప్రమాణశ్రీకారం చేయనున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాలమోహన్‌రెడ్డి తెలిపారు. 31 మధ్యాహ్నం 2గంటలకు హైదరాబాద్‌లోని శాసనమండలి చైర్మన్ చాంబర్‌లో ఆయన ప్రమాణశ్రీకారం చేస్తారని జిల్లా పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని ఆయన కోరారు.

డిచ్‌పల్లి వైస్ ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం



వైస్ ఎంపీపీపై జరిగిన అవిశ్వాసానికి హాజరైన ఆర్డీవో రాజేందర్ కుమార్



అవిశ్వాసానికి మద్దతుగా చేతులు ఎత్తిన ఎంపీటీసీలు



ఎంపీడీవో కార్యాలయం వద్ద పోలీసుల భద్రత

డిచ్‌పల్లి,జనవరి 29: డిచ్‌పల్లి వైస్ ఎంపీపీ శ్యాంరావు కులచారిపై ఎంపీటీసీ సభ్యులు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. సోమవారం డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో రాజేందర్ కుమార్ ఆధ్వర్యంలో అవిశ్వాస సమావేశం నిర్వహించారు. మొత్తం 17మంది ఎంపీటీసీలకు గాను 13మంది అవిశ్వాస సమావేశానికి హాజరయ్యారు. కోరం ఉండటంతో ఆర్డీవో ఆవిశ్వాస బలపరీక్ష నిర్వహించారు. వైస్ ఎంపీపీ శ్యాంరావు కులచారికి వ్యతిరేకంగా 13మంది ఎంపీటీసీలు చేతులు పైకెత్తడంతో ఆర్డీవో అవిశ్వాసం నెగ్గినట్లు ప్రకటించారు. అనంతరం ఆర్డీవో స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ నెల 8న ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీ గద్దె భూమన్న, వైస్ ఎంపీపీ శ్యాంరావు కులచారిలపై వేరు వేరుగా అవిశ్వాస తీర్మాణ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. దీనిపై ఈ నెల 29న ఉదయం 10:30గంటలకు ఎంపీపీపై ,11:30గంటలకు వైస్ ఎంపీపీలపై అవిశ్వాస సమావేశాలకు నిర్ణయం తీసుకుంటూ తాను ఎంపీటీసీ సభ్యులకు నోటీస్ జారీ చేశానని తెలిపారు. ఎంపీపీ అధ్యక్షుడు గద్దె భూమన్న అవిశ్వాస సమావేశం పై హైకోర్టు స్టే తీసుకురావడంతో ఉదయం 10:30 గంటలకు జరగాల్సిన సమావేశాన్ని వాయిద వేశామని ఆర్డీవో తెలిపారు. వైస్ ఎంపీపీపై అవిశ్వాస సమావేశం యధావిధిగా 11:30గంటలకు సభ్యుల కోరం ఉండటంతో నిర్వహించామని తెలిపారు. ఇందులో మెజార్టీ ఎంపీటీసీలు అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేశారని దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు ప్రకటించామని పేర్కొన్నారు. ఈ నివేదికను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు అందజేయనున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఈకార్యక్ర మంలో ఎంపీడీవో టీవీఎస్ గోపిబాబు, ఎంపీటీసీలు చిన్నోళ్ల నర్సయ్య, దుండుగుల సాయిలు, కృష్ణవేణి, పులినర్సింగరావు, రాజమని షాకటి, కుర్రి సవిత, దుంపల సౌమ్య, గండోళ్ల సుప్రియ, అల్లోల బాల గంగా ధర్, పోతర్ల సుజాత, రాథోడ్ భిక్యనాయక్, సాంపల్లి గోదావరి, అప్పల మంజుల, పాల్గొన్నారు.ఈ కార్యక్రమం జరుగుతుండగా బయట భారీగా పోలీసుల బందోబస్తు నిర్వహించారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందాం

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

నందిపేట,జనవరి29:పార్టీలకు అతీ తంగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందా మని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడిరాకేష్‌రెడ్డి కోరారు. సోమవారం నందిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సాధా రణ సర్వసభ్య సమావేశానికి జిల్లాపరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుతో కలిసి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ పొకడాలను పక్కనబెట్టి అర్హులైన ప్రతీఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందించాలని అధికారుల కు, ప్రజాప్రతినిధులకు సూచించారు. అన ర్హుల కు ఇళ్లు, పింఛన్‌లు ఇస్తే తాను అడ్డు కుంటానని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సభ ముఖంగా ప్రకటించారు. నందిపేటలో ట్రాన్స్ కో ఏఈ లేక విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని మండల కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్‌హుస్సేన్ మండల సభ దృష్టికి తీసుకు వచ్చారు. పాతపను లను పక్కనబెట్టి కొత్తపనులకు ప్రతిపాద నలు తయారు చేయాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కోరారు. నందిపేట మండలంలోని గ్రామాల అభివృద్ధి తనవంతు కృషి చేసేం దుకు జిల్లాపరిషత్ నిధులను కేటాయిస్తా నని జిల్లాపరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠ ల్‌రావు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీవో నాగవర్ధన్, తహసీల్దార్, ఎంఈవో, మిషన్ భగీరథ డీఈ గంగారాం, ఆయాగ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వార్షిక మొబలైజేషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



సమీక్ష నిర్వహిస్తున్న సీపీ

ఖిల్లా, జనవరి 29: వార్షిక మొబలైజేషన్ శిక్షణను సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌శింగనేవార్ అన్నారు.కమిషనరేట్ పరిధిలోని ఆర్మడ్ రిజర్వు సిబ్బందికి వార్షిక మొబలైజేషన్-24 సోమవారం నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీ మాట్లాడుతూ ఈనెల 29నుంచి 10ఫిబ్రవరి వరకు ఈ శిక్షణ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కాలంలో ఫిజికల్ ఎక్సర్సైజ్,యోగా, స్క్వాడ్‌డ్రిల్, ఆమ్స్‌డ్రిల్, ప్లాటూన్‌డ్రిల్,లాఠీడ్రిల్, వీఐపీ ఎస్కార్ట్, మాబ్ ఆపరేషన్‌డ్రిల్, బీడీటీంపై అవగాహన, ఆయుధాలపై ఆవగాహన, ఫైరింగ్‌ప్రాక్టీస్, హెచ్.ఆర్. ఎం.ఎస్.సెర్మోనియల్‌డ్రిల్, మొదలగు వాటి పట్ల శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతీరోజు సాయంత్రం స్పోర్ట్స్ నిర్వహిస్తారని సిబ్బంది ఎల్లప్పుడు ఫిజికల్ ఫిట్‌నెస్ ఉన్నప్పుడే తక్కుగా విధులు నిర్వహిస్తారన్నారు. సిబ్బంది తమ ఆరోగ్యం బాగుండడానికి శుభ్రమైన ఆహారం సరియైన సమయంలో తీసుకోవాలని సూచించారు. సిబ్బంది ఎల్లప్పుడు పాజిటివ్‌గా ఆలోచించాలని, ఎల్లప్పుడు సంతోషంగా ఉండాలని తెలిపారు. ప్రతీ ఒక్కరూ క్రమశిక్షణను అలవర్చుకోవాలని, తమ జీవన విధానంలో ఎప్పటికప్పుడు మార్పుదిశగా ప్రయణించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు డీసీపీ(ఏఆర్)గిరిరాజు, ప్రొబేషనరీ ఐపీఎస్ బి.చైతన్యరెడ్డి,హోమ్‌గార్డ్స్ ఏసీపీ. అరుణ్ కుమార్, రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీపాల్, శ్రీనివాస్, తిరుపతి,రమేష్ ఆర్ ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.